## ప్రమాద బీమా చెక్కు 2 లక్షలు అందజేత




మంచిర్యాల జిల్లా/ మందమర్రి, సెప్టెంబర్ 16/ అక్షరం న్యూస్ –:
గాయత్రి బ్యాంకు మందమర్రి శాఖ ఖాతాదారులైన మొయ్య లావణ్య ప్రమాదవశాత్తు మరణించగా, మృతురాలికి గాయత్రి నిర్భయ సేవింగ్ ఖాతాపై గల ప్రమాదభీమా సౌకర్యం ద్వారా మంజూరైన 2 లక్ష రూపాయల ప్రమాద భీమా చెక్కును ఆమె భర్త మొయ్య రాంబాబు కు బుధవారం మందమర్రి సబ్ ఇన్స్పెక్టర్ గోపతి నరేష్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ ఎమ్. సతీష్ మాట్లాడుతూ రైతులకు 10.50% సంవత్సరం చొప్పున వ్యవసాయ రుణాలను కూడా అందిస్తున్నామని తెలిపారు. మందమర్రి పరిసర గ్రామాలలో బ్యాంకింగ్ కరెస్పాండెంట్లను నియమించడం ద్వారా పెన్షనర్లు మరియు ఇతర ఖాతాదారులు ఇట్టి బ్యాంకింగ్ కరెస్పాండెంట్ల వద్ద బ్యాంకు లావాదేవీలను అందుబాటులోకి తెచ్చామన్నారు. వినియోగదారులకు 24 గంటలు ఏ.టి.ఎం లలో నగదు అందుబాటులో ఉంచడం ద్వారా మందమర్రి మరియు పరిసర ప్రాంత ప్రజల నగదు అవసరాలను తీరుస్తున్నామన్నారు. తక్కువ వడ్డీకే బంగారు ఆభరణాలపై గ్రాముకు అత్యధికంగా రూ॥ 8,600/- తో ఋణాలను అందిస్తున్నామన్నారు. సేవింగ్ ఖాతాలు ప్రారంభించుటకు కావలసిన ఫోటో మరియు జిరాక్స్‌ను బ్యాంకు యందే ఉచితంగా అందిస్తున్నామన్నారు. వ్యాపారస్తులకు వ్యాపార వృద్ధికై ఋణాలను అందిస్తున్నామని, అలాగే కిసాన్ వికాస్ పత్రాలు మరియు పోస్టుఆఫీస్ డిపాజిట్లపై కూడ కేవలం 0.83 పైసలకే అనగా 10% రేటుకి ఋణాసౌకర్యం అందిస్తున్నామని వినియోగదారులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవలసింది గా కోరారు.

## చింతలపాలెం ఘటనపై బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య తీవ్ర దిగ్భ్రాంతి

- **పూజారి దత్తు ప్రసాద్ మృతి పట్ల డా. సముద్రాల విజయసారథి సంతాపం**
- **పూజారిపై ఒత్తిడి, వాగ్వాదం జరగడం బాధాకరం.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**



రామగిరి, పెద్దపల్లి జిల్లా, సెప్టెంబర్ 16 (అక్షరం న్యూస్): నల్గొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలం చింతలపాలెం గ్రామంలో వినాయక చవితి సందర్భంగా చోటుచేసుకున్న విషాద ఘటనపై తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. గ్రామంలోని గణేష్ మండపంలో పూజ విషయంలో పూజారి దత్తు ప్రసాద్ తో కొందరు వ్యక్తులు వాగ్వాదానికి దిగిన అనంతరం ఆయన అస్వస్థతకు గురై మృతి చెందడం బాధాకరమని సమాఖ్య రాష్ట్ర కోశాధికారి, పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటనరీ కాలనీ శ్రీ భద్రకాళి ఆలయ ప్రధాన పూజారి డా. సముద్రాల విజయసారథి పేర్కొన్నారు. ఈ సందర్భంగా డా. విజయసారథి మాట్లాడుతూ.. పవిత్రమైన వినాయక మండపం వద్ద పూజారి దత్తు ప్రసాద్‌పై ఒత్తిడి తెచ్చి వాగ్వాదానికి దిగడం అత్యంత బాధాకరమన్నారు. ఘటన అనంతరం పూజారి అస్వస్థతకు గురై మృతి చెందడం పూజారి లోకానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. దత్తు ప్రసాద్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని, ఘటనకు బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పవిత్రమైన పండుగల సమయంలో ప్రతి ఒక్కరూ సంయమనం పాటిస్తూ, పూజారులు మరియు ఆలయ సిబ్బంది పట్ల గౌరవభావంతో వ్యవహరించాలని డా. సముద్రాల విజయసారథి సూచించారు.

## ఆర్‌జీ-1 ఏరియాలో హాకీ పోటీలు ప్రారంభం



జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 16 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : సింగరేణి రామగుండం ఏరియా-1 పరిధిలో ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్న అంతర్గత క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో హాకీ పోటీలను ప్రారంభించారు. పోటీలను డీజీఎం (సీఎస్‌పీ) పి. పైడిశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, ఓటమికి నిరుత్సాహపడకుండా తదుపరి స్థాయి పోటీల్లో మరింత ప్రతిభ కనబరిచి కోల్ ఇండియా స్థాయి పోటీలకు ఎంపికై రాణించాలని ఆకాంక్షించారు. ఆర్‌జీ-1 ఏరియా పరిధిలోని వివిధ గనులు, విభాగాలకు చెందిన క్రీడాకారులు హాకీ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో క్రీడా విభాగం గౌరవ కార్యదర్శి జి. హనుమంతరావు, సమన్వయకర్త గాండ్ల రాజయ్య, క్రీడాకారులు, క్రీడాభిమానులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## యువతకు ఉద్యోగ బాటలు,కోదాడలో మెగా జాబ్‌మేళా...






సూర్యాపేట/నేరేడుచర్ల, సెప్టెంబర్ 16: కోదాడలో ఈ నెల 19న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాలో అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ కొణతం చిన్న వెంకటరెడ్డి కోరారు. కోదాడలోని సీసీ రెడ్డి కాన్వెంట్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. గత ఏడాది నిర్వహించిన జాబ్‌మేళాలో 200 కంపెనీలు పాల్గొని సుమారు 3 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ప్రకాష్, కట్ట రామారావు, రాచకొండ అజయ్, యామినివీరయ్య, కౌన్సిలర్లు ఇంజమూరి శ్రీకాంత్, నన్నిపంగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన దినోత్సవం పురస్కరించుకొని తిరంగా ర్యాలీ






కరీంనగర్/ హుజురాబాద్/ సెప్టెంబర్ 16/ అక్షరం న్యూస్:
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హుజరాబాద్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రోజున తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పూసాల విష్ణు కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల అణచివేతకు వ్యతిరేకంగా ప్రజలు, యోధులు పోరాడారు. భారత ప్రభుత్వం సెప్టెంబర్ 17, 1948న 'ఆపరేషన్ పోలో' పోలీసు చర్య ద్వారా హైదరాబాద్‌ను భారత యూనియన్‌లో విలీనం చేసింది. నిజాం పాలన నుంచి విముక్తి పొంది, ప్రజలకు స్వేచ్ఛ లభించిన ఈ చారిత్రక సంఘటన జ్ఞాపకార్థం. ఈ,రోజును విమోచన దినంగా పాటిస్తారు అన్నారు. రాష్ట్ర నాయకులు గోస్కుల అజయ్ మాట్లాడుతూ నిజాం సైన్యాధిపతి సయ్యద్ అహ్మద్ ఎల్-ఎడ్రూస్ లొంగిపోయారు. నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ రేడియో ద్వారా తన ఓటమిని, కాల్పుల విరమణను ప్రకటించి, భారత్‌లో హైదరాబాద్ విలీనాన్ని అంగీకరించారు. ఫలితం: సెప్టెంబర్ 18న అధికారికంగా లొంగిపోవడం పూర్తయింది. దీంతో నిజాం నిరంకుశ పాలన అంతమై, ప్రజలకు రజాకార్ల హింస నుంచి విముక్తి లభించిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి సాయి చరణ్, నగర సంయుక్త కార్యదర్శిలు కుమారస్వామి, శివ, అజయ్, భార్గవ్ , నగర ఉపాధ్యక్షులు చరణ్ తేజ, రాకేష్, కృష్ణ, మనిప్రీతం,ఇతర కార్యకర్తలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పాత రామగుండంలో ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం





- **స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం: హర్కర వేణుగోపాల్‌రావు**

జ్యోతినగర్, ఎన్టీపీసీ సెప్టెంబర్ 16 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాత రామగుండం గ్రామంలో ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా హర్కర వేణుగోపాల్‌రావు మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన, శుద్ధమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. పాత రామగుండం ప్రజలకు నాణ్యమైన తాగునీటిని అందించడంలో ఆర్ఓ వాటర్ ప్లాంట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజల మౌలిక అవసరాల పరిష్కారానికి ప్రభుత్వంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు సామాజిక బాధ్యత కార్యక్రమాల ద్వారా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఎన్టీపీసీ సీఎస్ఆర్ నిధులతో అందుబాటులోకి వచ్చిన ఈ ప్లాంట్ ద్వారా స్థానిక ప్రజలకు తాగునీటి సమస్య కొంతవరకు పరిష్కారం కానుందని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మానాలీ రాజ్ ఠాకూర్, స్థానిక మేయర్ మహంకాళి స్వామి, కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాత రామగుండం ప్రజల తాగునీటి అవసరాలకు పరిష్కారంగా ఆర్ఓ వాటర్ ప్లాంట్ అందుబాటులోకి రావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా పొన్నం సత్తయ్య గౌడ్ 16 వ వర్ధంతి

- **నివాళులు అర్పించిన ప్రముఖులు నాయకులు.**



కరీంనగర్, హుజురాబాద్/ సెప్టెంబరు 16/అక్షరం న్యూస్ :
రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తండ్రి పొన్నం సత్తయ్య గౌడ్ 16వ వర్ధంతి సందర్భంగా కరీంనగర్ లోని ఘాట్ వద్ద పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రణవ్ బాబు, హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు పాల్గొని పొన్నం సత్తయ్య గౌడ్ సమాధి వద్ద పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొన్నం సత్తయ్య గౌడ్ సమాజ సేవకు అంకితమైన జీవితం గడిపారని, ఆయన ఆశయ సాధనలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ముందుకు సాగుతున్నారని కొనియాడారు. ఆయన చూపిన బాటలోనే పేదల సంక్షేమానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశిని కోటి, జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుంకరి రమేష్, కౌన్సిలర్ ఎగిత సుజాత అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడిని మర్యాదపూర్వకంగా కలిసిన పోలీస్ కమిషనర్



జ్యోతి నగర్ ఎన్టిపిసి సెప్టెంబర్ 16 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్
పెద్దపల్లి జిల్లా ఎన్‌టీపీసీ జ్యోతి భవన్‌కు విచ్చేసిన జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**మునిసిపల్ చైర్మన్: పద్మ శ్రీకాంత్**



కామారెడ్డిజిల్లా/ ఎల్లారెడ్డి/ సెప్టెంబర్16/ అక్షరం న్యూస్: విద్యార్థులు విద్యలో రాణించి, ఉన్నత శిఖరా లను అధిరోహించాలని మునిసిపల్ చైర్మన్ పద్మ శ్రీకాం త్ అన్నారు. బుధవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్ర భుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యూ నిఫాం దుస్తులు, బూట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజ రయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల వి ద్యాభివృద్ధికి,మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వంఅన్ని విధాలా కృషి చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాల ల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమై న అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని,వీటిని సద్విని యోగం చేసుకొని విద్యార్థులు చదువులో రాణించి ఉ న్నత శిఖరాలనుఅధిరోహించాలని ఆకాంక్షించారు. చదు వుతో పాటు క్రీడలు, క్రమశిక్షణలోనూ ముందంజలో ఉం డాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్య క్షుడు విద్యాసాగర్, కాంగ్రెస్ నాయకులు రఫీక్, కౌన్సిలర్ తిరుపతి, కో-ఆప్షన్ సభ్యుడు పప్పు వెంకటేశం, పాఠశా ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పాఠశా ల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓజోన్ పొర పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలి



చొప్పదండి/ కరీంనగర్,సెప్టెంబర్ 16 (అక్షరం న్యూస్ )

ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ మరియు లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు, బహుమతి ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. చొప్పదండి పట్టణంలోని ఇప్పనపల్లి హరికృష్ణ హైస్కూల్ (బాలుర)లో "ఓజోన్ పొర పరిరక్షణలో మన బాధ్యత" అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఓజోన్ పొర ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నివారణ తదితర అంశాలపై తమ ఆలోచనలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులకు లయన్స్ క్లబ్ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. ఓజోన్ పొర భూమిపై జీవరాశులను సూర్యుని నుంచి వెలువడే హానికరమైన అతినీలలోహిత కిరణాల నుంచి రక్షిస్తుందని, దాని పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని కార్యక్రమంలో వక్తలు పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని వారు తెలిపారు. భవిష్యత్ తరాల ఆరోగ్యం, సురక్షితమైన పర్యావరణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్, అధ్యక్షులు మ్యాడమ్ శివకాంత్ పటేల్ ,లయన్స్ క్లబ్ ఆఫ్ చొప్పదండి అధ్యక్షుడు వల్లాల జగన్, డిస్టిక్ క్యాబినెట్ సెక్రటరీ వల్లాల క్రిష్ణహరి,డిస్టిక్ క్యాబినెట్ ట్రెజరర్ కొల్లూరు ఆనందం, డిస్టిక్ మెంటర్ సింగమరాజు, ప్రోగ్రామ్స్ చైర్మన్ లంబు సుధాకర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి ఇప్పనపల్లి సాంబయ్య, మెతుకు కృష్ణ, చైతన్య, దూస రాము అయిత సూరజ్,లయన్ ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జలీల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీ కళ్యాణ మంటపం ప్రదేశంలో వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణం చేపట్టాలి



చొప్పదండి/ కరీంనగర్,సెప్టెంబర్ 16 (అక్షరం న్యూస్ )

చొప్పదండి పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపం ఆవరణలో కళ్యాణమండపం విస్తరించడంతోపాటు తిరుపతి దేవస్థాన కమిటీ ద్వారా వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మించాలని వెంకటేశ్వర దేవాలయ నిర్మాణ కమిటీ సభ్యులు మాజీ జెడ్పిటిసి సభ్యుడు ఇప్పెనపల్లి సాంబయ్య కోరారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన కళ్యాణ మండపంలో బుధవారం వారు సందర్శించి మాట్లాడారు. చొప్పదండి మేజర్ గ్రామపంచాయతీ గా ఉన్న సమయంలో గ్రామపంచాయతీ స్థలం ఎకరం భూమితో పాటు కళ్యాణ మండపం నిర్మాణం కొరకు లక్ష రూపాయలను ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. ఆ సమయంలో నిర్మాణం చేసిన కళ్యాణ మండపం ప్రజలకు ఉపయోగపడే విధంగా విస్తరించలేదని, 20 కోట్ల రూపాయల పైబడి ఉన్న స్థలాన్ని కళ్యాణ మండపం నిర్మాణం కొరకు ఇవ్వడంతో కళ్యాణ మండపము నిరుపయోగంగా ఉండడంతో కళ్యాణ మండపం శిథిలావస్థకు చేరుతుందని పేర్కొన్నారు. చొప్పదండి పట్టణ ప్రజల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణ మండపం ఆవరణలో కళ్యాణ మండపాన్ని విస్తరించడంతోపాటు వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని నిర్మించాలని లేదా పట్టణ ప్రజల ఆధ్వర్యంలో దేవాలయ నిర్మాణం చేసుకునేందుకు అనుమతులు ఇప్పించాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎంపిటిసి ఎలిగేటి తిరుపతి, పట్టణ పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు అనుమండ్ల సత్యం, నాయకులు సిరిపురం లింగమూర్తి, గుండ నరసయ్య, వెంకటేశం ,వల్లాల సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కుల మతాలకతీతంగా దుబ్బాక అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుదాం



సిద్దిపేట జిల్లా / దుబ్బాక / సెప్టెంబర్ 16 / అక్షరం న్యూస్ -:

కుల మతాలకతీతంగా దుబ్బాక అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు కుల సంఘాలు తెలిపాయి. ఇటీవల దుబ్బాక పట్టణంలో బొడ్రాయి ఏర్పాటు చేసుకోవడం జరిగింది. అందులో భాగంగా దుబ్బాక పట్టణంలో ఆనవాయితీ ప్రకారం ఏ కార్యక్రమమైనా దుబ్బాక బొడ్రాయి మీదగా వెళ్లవలసింది ఉంటుంది. అందులో భాగంగా దుబ్బాక పట్టణంలో జరుగుతున్న వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బొడ్రాయి ఇరువైపులా రహదారి వెడల్పు చేయాలని సంకల్పంతో అన్ని కుల సంఘం ఏకమై రోడ్డు వెడల్పు చేయాలని తీర్మానించడం జరిగింది. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి దుబ్బాక పట్టణ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## చొప్పదండి మండలంలో కరెంటు సక్రమంగా సరఫరా చేయాలి

**బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి**



చొప్పదండి/కరీంనగర్,సెప్టెంబర్ 16 (అక్షరం న్యూస్ )

చొప్పదండి మండలంలో ప్రభుత్వ అసమర్థతతో కరెంట్ సరఫరా అస్తవ్యస్తంగా మారిందని కరెంట్ కోతలకు స్థానిక శాసన సభ్యులు మేడిపల్లి సత్యం భాధ్యత వహించాలని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎంపిటిసి సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ చొప్పదండి రూరల్ శాఖ అధ్యక్షులు మొగిలి మహేష్ ఆధ్వర్యంలో చొప్పదండి లోని ఒక ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరెంటు కోతలు మండలంలోని అన్ని సబ్ స్టేషన్ల పరిధిలో నిత్యకృత్యంగా మారాయని రైతులు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకునే నాధుడు లేడని నియోజకవర్గ కేంద్రంలోనీ సబ్ స్టేషన్ లో సబ్ ఇంజనీర్ పోస్ట్ ఖాళీగా ఉందని ఆరుగురు లైన్మెన్ లకు గాను ముగ్గురు లైన్మెన్లు మాత్రమే ఉండడంతో చొప్పదండి సెక్షన్ పరిధిలో విద్యుత్తు సరఫరా అస్తవ్యస్తంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సొంత పార్టీ అనుచరులకు పదవులు కట్టబెట్టడంలో ఉన్న శ్రద్ధ అత్యవసర సేవలు అయినటువంటి విద్యుత్ విభాగంలో లైన్మెన్ లో నియమించడంలో ఎమ్మెల్యేకు లేకపోవడం శోచనీయమని కృష్ణారెడ్డి ఆరోపించారు. మున్సిపాలిటీ పరిధిలో అనేక వాడల్లో లోవోల్టేజి సమస్య ఉందని మున్సిపల్ ఎన్నికలలో హైవోల్టేజ్ ఉపన్యాసాలు ఇచ్చిన అధికార పార్టీ నాయకులు ఇప్పుడు లోవోల్టేజీ సమస్యను పరిష్కరించకపోవడం శోచనీయమని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పని తీరు వలన కాలేశ్వరం నీళ్లు కాలువల్లో రాకపోవడంతో రైతులు నీటికి ఇబ్బంది పడుతున్నారని కనీసం బావులలో ఉన్న నీటితో పంటలు కాపాడుకుందాం అంటే కరెంటు కోతలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, బ్రేక్ డౌన్ వస్తె బాగుచేసే సిబ్బంది లేరని, అనేకచోట్ల ట్రాన్స్ఫార్మర్ల కెపాసిటీ పెంచాలనిపవర్ సమస్యలు పరిష్కరించకపోతే రాబోవు ఎన్నికల్లో రైతులు అధికార పార్టీ , పవర్ కట్ చేస్తారని ఫ్యూజులు తొలగిస్తారని తక్షణం విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు గుమ్లాపూర్ మాజీ ఎంపీటీసీ బత్తుల లక్ష్మీనారాయణ, భూపాలపట్నం మాజీ ఉపసర్పంచ్ బైరాగోని కిట్టు గౌడ్ , గుమ్లాపూర్ మాజీ ఉపసర్పంచ్ విలాసాగరం అంజయ్య, మండల ప్రధాన కార్యదర్శిలు కొమ్ము రమేష్ ,ఎడ్ల సురేష్, గన్ను నరసింహారెడ్డి, కాయిత సాయి కృష్ణ, ఐద మారుతి ,యువ మోర్చ మండల అధ్యక్షులు పెద్ది వీరేశం, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు మడిపల్లి రాజు, ముద్దం చందు, గొల్లపల్లి ముని, మ్యాకల రాములు తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై ప్రయాణికులకు పోలీసుల అవగాహన కార్యక్రమం..



కామారెడ్డిజిల్లా/ఎల్లారెడ్డి/సెప్టెంబర్ 16/అక్షరం న్యూస్:

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బస్టాండ్ లో బుధవారం పో లీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రయాణికులకు దొంగతనాలు, మాదకద్రవ్యాల వినియోగం, రోడ్డు ప్రమాదాల నివారణ, మైనర్ల వాహనాలు నడపడం వంటి అంశాలపై అవగా హన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జి ల్లాఎస్పీ రాజేష్ చంద్రఆదేశాలమేరకు పట్టణఎస్ఐ ఎన్. రాజు సూచన మేరకు నిర్వహించినట్లు ఏఎస్ఐ దేవా గౌ డ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్ర యాణికులు ముఖ్యంగా బస్సుఎక్కేటప్పుడు, దిగేటప్పు డు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, త మ విలువైనవస్తువులను జాగ్రత్తగా చూసుకోవాలనిసూ చించారు. సైబర్ నేరగాళ్లపట్ల జాగ్రత్తగా ఉండాలని, సైబ ర్ నేరాలకు గురైన వారు వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేయాలని,అపరిచిత వ్యక్తులకు ఓటీపీలుచెప్ప వద్దని సూచించారు. మాదక ద్రవ్యాలు గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని, మైనర్లు వాహనాలు నడప రాదని, మద్యం సేవించి వివాహన నడపడం ప్రమాదకర మని వివరించారు. మహిళల రక్షణకు షీ టీం ఎల్లప్పు డూ అందుబాటులో ఉంటుందని, అత్యవసర పరిస్థితి లో షీ టీం నెంబర్ 87126 86 094 కు సంప్రదించాలని, మాదక ద్రవ్యాల నిర్మూలనకు టోల్ ఫ్రీ నెంబర్ 1980 కు సమాచారంఅందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు కళాబృందం ఇంచార్జ్ హెడ్ కానిస్టేబుళ్లు రామం చ తిరుపతి, యు. శేషారావు, కానిస్టేబుళ్లు ప్రభాకర్, సా యిలు, మహేందర్ గౌడ్, ఆర్ రచన తదితరులు ప్రయా ణికులు పాల్గొన్నారు.

## పాలు, పెరుగు అమ్ముతున్నాడని పాల వ్యాపారిపై కర్రతో దాడి.. నిందితుడికి ఏడాది 4 నెలల జైలు

దమ్మపేట జేఎఫ్‌సీఎం కోర్టు తీర్పు రూ. 3,500 జరిమానా విధింపు

భద్రాద్రి కొత్తగూడెం / అశ్వారావుపేట / సెప్టెంబర్ 16 / అక్షరం న్యూస్ : అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో పాల వ్యాపారిపై దాడి చేసిన కేసులో నిందితుడికి దమ్మపేట జేఎఫ్‌సీఎం కోర్టు ఏడాది 4 నెలల జైలు శిక్షతో పాటు రూ. 3,500 జరిమానా విధించింది.

### పాల వ్యాపారిపై దాడి..

అచ్యుతాపురం గ్రామానికి చెందిన కలపాల నరేష్ తన ఆటోలో పాలు, పెరుగు విక్రయించేందుకు వినాయకపురం గ్రామానికి వెళ్లాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన దంతెనపల్లి రాంబాబు నరేష్ ఆటోను అడ్డుకుని, వినాయకపురం వచ్చి పాలు, పెరుగు ఎందుకు అమ్ముతున్నావంటూ గొడవకు దిగాడు. అనంతరం కర్రతో నరేష్‌పై దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు.

### 2018లో కేసు నమోదు..

ఈ ఘటనపై బాధితుడు కలపాల నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 27 మే 2018న అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 125/2018 కింద కేసు నమోదు చేశారు. 341, 324, 294(బి), 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### కోర్టు తీర్పు..

కేసును విచారించిన దమ్మపేట జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి బి. భవాని నిందితుడు దంతెనపల్లి రాంబాబు, తండ్రి నాగేశ్వరరావు, వయస్సు 38 సంవత్సరాలు, వినాయకపురం గ్రామం, అశ్వారావుపేట మండలం,కు ఏడాది 4 నెలల జైలు శిక్ష, రూ. 3,500 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. కేసు దర్యాప్తు అధికారిగా అశ్వారావుపేట ఎస్ఐ వి. వెంకటేశ్వర్ వ్యవహరించారు. నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేసిన పోలీసు అధికారులను ఉన్నతాధికారులు అభినందించారు.

## అనంత్ నాగ్‌కు ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం

**ఈ నెల 22న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రధానం**



ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్‌ను సినీ రంగంలో అత్యున్నత ప్రతిష్టాత్మక పురస్కారం దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు వరించింది. 2024 సంవత్సరానికి ఆయనకు ఈ అవార్డును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. భారతీయ సినిమాకు అనంత్ నాగ్ అందించిన సేవలు, విశిష్టమైన సినీ ప్రస్థానానికి గుర్తింపుగా ఈ పురస్కారం అందించినట్లు కేంద్రం తెలిపింది. గుజరాత్‌లోని కేవడియాలో ఈ నెల 22న జరగనున్న 72వ జాతీయ చలన చిత్ర అవార్డుల ప్రధానోత్సవంలో అనంత్ నాగ్‌కు... రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ పురస్కారం అందజేయనున్నారు. కన్నడతో పాటు పలు భాషల్లో దాదాపు 300కు పైగా సినిమాల్లో నటించారు అనంత్ నాగ్. ఆయనకు అత్యున్నత పురస్కారం దక్కడం పట్ల కన్నడ ఇండస్ట్రీతో పాటు సినీ అభిమానులు, పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. నటుడు అనంత్ నాగ్‌కు ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ప్రతిష్టాత్మక దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారంతో సత్కరించబడిన ప్రఖ్యాత నటుడు అనంత్ నాగ్ గారికి అభినందనలు. గత కొన్ని దశాబ్దాలుగా, ఆయన సహజ నటన, అద్భుతమైన బహుముఖ ప్రజ్ఞ, అసాధారణమైన కళా నైపుణ్యం భారతీయ సినిమాపై, ముఖ్యంగా కన్నడ చిత్ర పరిశ్రమపై చెరగని ముద్ర వేశాయి. ఆయన పోషించిన ప్రతి పాత్రలోనూ సాటిలేని నటనను, జీవాన్ని నింపారు. ఒక గొప్ప కళాకారుడికి ఇది నిజంగా దక్కిన అర్హమైన గౌరవం.' అంటూ పోస్ట్ చేశారు. దాదాపు 5 దశాబ్దాల సినీ ప్రయాణంలో అనంత్ నాగ్... కన్నడతో పాటు తెలుగు, హిందీ, మరాఠీ, మలయాళ, ఇంగ్లీష్ భాషల్లో దాదాపు 300కు పైగా సినిమాల్లో నటించారు. తన నటనతో ఎంతో మంది ప్రేక్షకుల మనసు గెలుచుకున్నారు. థియేటర్ నటుడిగా కెరీర్ ప్రారంభించిన ఆయన... 1973లో కన్నడ మూవీ 'సంకల్ప'తో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత మంథన్, కొందుర, కల్‌యుగ్ తదితర చిత్రాలు ఆయనకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టాయి. ఆర్కే నారాయణన్ కథల ఆధారంగా తెరకెక్కించిన ఫేమస్ టీవీ సీరియల్ 'మాల్గుడి డేస్'లో అనంత్ నాగ్ మిఠాయి వాలా పాత్రతో దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యారు. అలాగే, రాజ కుమార, గాలిపట 2, కేజీఎఫ్, కన్నేశ్వర రామ వంటి మూవీస్ మరింత పేరు తీసుకొచ్చాయి. తెలుగులో భీష్మ, బాలు, అనుగ్రహం, శంఖారావం వంటి చిత్రాల్లో నటించారు. భారతీయ సినిమాకు ఆయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 2025లో 'పద్మ భూషణ్'తో గౌరవించింది. ఇప్పుడు అత్యున్నత దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందించనుంది.

# కొచ్చి వేదికగా అక్టోబర్‌లో మెగా ఆక్షన్ నిర్వహణ..

**డబ్ల్యూపీఎల్ 2027 తేదీలు ఖరారు**



మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఐదో సీజన్ నిర్వహణకు సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) బుధవారం కీలక ప్రకటన విడుదల చేసింది. డబ్ల్యూపీఎల్ 2027 ఎడిషన్ మ్యాచ్‌లను 2027 జనవరి 14 నుంచి ఫిబ్రవరి 7 వరకు నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. ఈ కొత్త సీజన్ కోసం ఆటగాళ్ల మినీ వేలాన్ని ఈ ఏడాది అక్టోబర్ 28న కేరళలోని కొచ్చి నగరంలో జరుపుతారు. అయితే ఈ టోర్నీ మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే వేదికల వివరాలను మాత్రం బీసీసీఐ ప్రస్తుతానికి వెల్లడించలేదు. మహిళల క్రికెట్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద టీ20 లీగ్‌గా అవతరించిన డబ్ల్యూపీఎల్, సరికొత్త ప్రతిభను వెలికితీయడంలో కీలక పాత్ర పోషిస్తోందని బోర్డు తన అధికారిక ప్రకటనలో తెలిపింది. ఇండియా అంతర్జాతీయ స్టార్లతో పాటు వర్ధమాన క్రీడాకారిణులు తమ సత్తా చాటేందుకు ఈ లీగ్ గొప్ప వేదికగా నిలిచింది. రాబోయే సీజన్ కోసం ఐదు ఫ్రాంచైజీలు తమ జట్లను సిద్ధం చేసుకోవడంపై కసరత్తు చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న జట్ల నుంచి ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి బీసీసీఐ సెప్టెంబర్ 28ని ఆఖరి గడువుగా నిర్ణయించింది. ఈ గడువు లోగా ఫ్రాంచైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను సమర్పించాల్సి ఉంటుందని తెలుస్తోంది. రాబోయే సీజన్‌కు సరిపడే అత్యుత్తమ కాంబినేషన్‌లను ఎంపిక చేసుకోవడానికి జట్లకు ఇది మంచి అవకాశం. 2026 ఎడిషన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) సంచలన ఆటతీరుతో రెండోసారి డబ్ల్యూపీఎల్ ట్రోఫీని కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన సారథ్యంలో బరిలోకి దిగిన ఆర్సీబీ, అద్భుత ప్రదర్శనతో టైటిల్ నిలబెట్టుకుంది. ఆ సీజన్ మ్యాచ్‌లను నవీ ముంబై, బరోడాలలో విజయవంతంగా నిర్వహించారు. ఇప్పుడు జరగబోయే ఐదో సీజన్‌లోనూ విజేతగా నిలిచి హ్యాట్రిక్ సాధించాలని ఆర్సీబీ బృందం కృతనిశ్చయంతో ఉంది. ఇందుకు తగిన కసరత్తు ముమ్మరం చేస్తోంది ఆ టీమ్ మేనేజ్మెంట్. 2023లో ఆరంభమైన డబ్ల్యూపీఎల్ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు చెరో రెండుసార్లు ఛాంపియన్లుగా నిలిచాయి. కొచ్చిలో జరిగే వేలం తర్వాత ఐదు ఫ్రాంచైజీలు కొత్త వ్యూహాలతో బరిలోకి దిగనున్నాయని తెలుస్తోంది. ఇక మిగతా జట్లు కూడా విజేతగా నిలిచేందుకు వ్యూహాలు పన్నుతున్నాయి.



# ఓటీటీలోనూ సత్తా చాటుతోన్న విశ్వనాథ్ అండ్ సన్స్..



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, మమితా బైజు జంటగా నటించిన సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ ఫ్యామిలీ డ్రామా థియేటర్లలో భారీ విజయం సాధించింది. అనంతరం సెప్టెంబర్ 11న నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ మూవీ థియేటర్ రన్‌లోనే కాదు.. ఓటీటీలోనూ తన సత్తా చాటుతోంది. ఈ క్రమంలో ముఖ్యంగా దళపతి విజయ్, ప్రభాస్ సినిమాల వ్యూస్‌ను అధిగమిస్తూ సూర్య మూవీ సరికొత్త రికార్డు సృష్టించింది. 'విశ్వనాథ్ అండ్ సన్స్' తొలి వారంలోనే రికార్డు స్థాయి వ్యూస్ సొంతం చేసుకుంది. నెట్‌ఫ్లిక్స్ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. ఈ సినిమా తొలి వారం (సెప్టెంబర్ 7 నుంచి 13 వరకు)లోనే 5.5 మిలియన్ వ్యూస్ సాధించింది. మొత్తం 14.6 మిలియన్ వ్యూయింగ్ అవర్స్ నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా నెట్‌ఫ్లిక్స్ నాన్-ఇంగ్లిష్ మూవీస్ ట్రెండింగ్ జాబితాలో మూడో స్థానంలో నిలిచింది. ఈ రికార్డు బట్టి చూస్తే ఈ సినిమాకు ఇండియాలోనే కాకుండా విదేశీ మార్కెట్లలోనూ ప్రేక్షకుల ఆదరణ లభిస్తోంది. నెట్‌ఫ్లిక్స్‌లో ప్రస్తుతం ఈ సినిమా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో అందుబాటులో ఉంది. 5.5 మిలియన్ వ్యూస్‌తో 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. 2026లో థియేటర్ల తర్వాత ఓటీటీలోకి వచ్చిన సౌత్ ఇండియన్ సినిమాల ఫస్ట్ వీక్ వ్యూయర్‌షిప్‌లో టాప్ లో నిలిచింది. అంతకుముందు విజయ్ మూవీ బ్లాస్ 4.4 మిలియన్ వ్యూస్‌తో టాప్ ఉండగా.. సూర్య సినిమా ఆ రికార్డును బ్రేక్ చేసింది. కరా 3.8 మిలియన్, జననాయగన్ 3.6 మిలియన్, ప్రభాస్ 'రాజాసాబ్ 3.4 మిలియన్ వ్యూస్‌తో తదుపరి స్థానాల్లో నిలిచాయి. అంటే సూర్య సినిమా థియేటర్లలో సాధించిన విజయాన్ని ఓటీటీ రిలీజ్ తర్వాత కూడా కొనసాగించిందని చెప్పొచ్చు. ఇదే సమయంలో మరో రికార్డు నమోదైంది. నెట్‌ఫ్లిక్స్‌లో థియేట్రికల్ రిలీజ్ తర్వాత స్ట్రీమింగ్‌కు వచ్చిన సౌత్ ఇండియన్ సినిమాల ఆల్‌టైమ్ ఫస్ట్ వీక్ వ్యూయర్‌షిప్‌లో 'విశ్వనాథ్ అండ్ సన్స్' 5.5 మిలియన్ వ్యూస్‌తో రెండో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో అల్లు అర్జున్ పుష్ప 2 5.8 మిలియన్ వ్యూస్‌తో మొదటిస్థానంలో ఉండగా.. ఆ తర్వాత 'విశ్వనాథ్ అండ్ సన్స్' 5.5 మిలియన్‌తో నిలిచింది. ఇడ్లీ కాడాయి 5.2 మిలియన్, లక్కీ భాస్కర్ 5.1 మిలియన్, బాస్ట్ 4.4 మిలియన్ వ్యూస్‌తో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అంటే కేవలం 2026లోనే కాకుండా నెట్‌ఫ్లిక్స్‌లో సౌత్ సినిమాల డిజిటల్ వ్యూస్‌లో కూడా కూడా సూర్య మూవీ టాప్‌లో నిలిచిందన్నమాట. ఇక సూర్య మూవీకి అంతర్జాతీయంగా కూడా మంచి ఆదరణ లభిస్తోంది. 14 దేశాల్లో నెట్‌ఫ్లిక్స్ టాప్ 10లో ఈ సినిమా ట్రెండింగ్ లో ఉంది. బహ్రెయిన్, శ్రీలంక, భారత్, యూఏఈ వంటి దేశాల్లో టాప్ స్థానంలో నిలిచినట్టు నెట్ ఫిక్స్ తెలిపింది. ఇది సూర్య సినిమాకు ఉన్న మార్కెట్‌ను మరోసారి చూపిస్తోంది. ముఖ్యంగా తెలుగు, తమిళం అనే రెండు ప్రధాన మార్కెట్లతో పాటు ఇతర భాషల్లోనూ విడుదల కావడంతో ఈ సినిమా ఈ రేంజ్‌లో గ్లోబల్ రీచ్ అందుకుందని చెప్పాలి.

# వైభవ్ తో పోటీ బయటి ప్రపంచానికి మాత్రమే

అఫ్గానిస్తాన్‌తో జరిగిన రెండో టీ20 పోరులో 160 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమ్ ఇండియా ఏ దశలోనూ ఒత్తిడికి లోనుకాకుండా, ఆడుతూ పాడుతూ టార్గెట్ చేజ్ చేసింది. ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ తొలి వికెట్‌కు 88 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని జోడించారు. కేవలం 22 బంతుల్లోనే 57 పరుగులు సాధించి సంజూ ఫామ్‌లోకి రావడంతో భారత్ 14.5 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది. ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో 15 ఏళ్ల వండర్‌కిడ్ వైభవ్ సూర్యవంశీతో పోటీ గురించి వస్తున్న ఊహాగానాలకు సంజూ తనదైన శైలిలో స్పందించాడు. ఫామ్ అనేది తాత్కాలికం, క్లాస్ ఎప్పటికీ శాశ్వతం అని మరోసారి నిరూపించాడు. మ్యాచ్ అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఓపెనింగ్ స్థానం కోసం నెలకొన్న తీవ్ర పోటీపై అడిగిన ప్రశ్నకు సంజూ దీటుగా ఆన్సరిచ్చాడు. ఓపెనింగ్ బెర్త్‌ల వివాదంపై సంజూ శాంసన్ స్పందిస్తూ, "బయటి ప్రపంచానికి మాత్రమే వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ నాకు పోటీదారులుగా కనిపిస్తారు. కానీ డ్రెస్సింగ్ రూమ్‌లో మేమంతా ఒకే జట్టుగా దేశం కోసం ఆడుతున్నాం. మాకు జట్టు విజయం మాత్రమే ముఖ్యం, ఆ తర్వాతే వ్యక్తిగత ప్రదర్శనలు వస్తాయి. అతడికి అవకాశం ఇచ్చారు, నాకు ఎందుకు రాలేదు అని బాధపడుతూ నెగెటివ్ ఆలోచనలతో కూర్చోవడం మా జట్టు సంస్కృతిలో లేదు. అలాంటి మనస్తత్వాలు ఇక్కడ పనికిరావు" అని పేర్కొన్నాడు. సోషల్ మీడియాలో మాజీ క్రికెటర్లు చేసే వ్యాఖ్యల గురించి సంజూ శాంసన్ మాట్లాడుతూ, "సాధారణంగా నేను వైఫై ఆఫ్ చేసి నెగెటివిటీకి దూరంగా ఉంటాను. కానీ కొన్నిసార్లు ఆ కామెంట్లు నా కంట పడుతుంటాయి. ఇండియాలో ఆడుతున్నప్పుడు ఇలాంటి కామెంట్లు ఆటగాళ్లపై ప్రభావం చూపుతాయి. మేం రోబోలం కాదు, మాకు భావోద్వేగాలు ఉంటాయి. గతంలో విమర్శలు నన్ను కూడా బాధించాయి. అయితే అనుభవంతో వాటిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నాను. ఒక షాట్ ఆడే ముందు బయట ఏమనుకుంటారో అని ఆలోచిస్తే నేను ఇలా బ్యాటింగ్ చేయలేను" అని తెలిపాడు. మొదటి రెండు మ్యాచ్‌ల్లో సంజూ, అభిషేక్‌లు రాణించినప్పటికీ, బెంచ్‌పై ఉన్న వైభవ్ సూర్యవంశీకి మూడో టీ20లో అవకాశం ఇస్తామంటూ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సూచన ప్రాయంగా చెప్పాడు. దీంతో ఆఖరి పోరులో ఎవరికి విశ్రాంతి ఇస్తారనేది ఆసక్తిగా మారింది. ఇక ఈ ఈ సిరీస్ ను ఇప్పటికే 2-0తో ఇండియా కైవసం చేసుకోగా, స్వదేశంలో శ్రేయస్ కిదే తొలి సిరీస్ విక్టరీ కావడం విశేషం.

## 'ది ప్యారడైజ్'కు సెన్సార్ పూర్తి..




నేచురల్ స్టార్ నాని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ది ప్యారడైజ్' సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. ఫిల్మ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ ఏ సర్టిఫికేట్ జారీ చేసింది. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించిన ఈ సినిమా మొత్తం 2 గంటల 49 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం గురించి నాని మాట్లాడుతూ, తన 18 ఏళ్ల సినీ కెరీర్‌లో ఇంతగా శ్రమించిన సినిమా మరొకటి లేదని అన్నారు. "శారీరకంగా, మానసికంగా 'ది ప్యారడైజ్' నన్ను బాగా అలసిపోయేలా చేసింది. ఇంత కష్టపడి నేను మరో సినిమాకు పనిచేయలేదు" అని ఇటీవల మీడియా సమావేశంలో తెలిపారు. సోషల్ మీడియాలో వస్తున్న వదంతులపై కూడా ఆయన స్పష్టత ఇచ్చారు. "సినిమాలో నీటి అడుగున సన్నివేశాలు ఉన్నాయని, వెయ్యి మందితో ఫైట్ ఉంటుందని వార్తలు వస్తున్నాయి. వాటిలో నిజం లేదు. ఇది ఒక వాస్తవిక కథ. యాక్షన్ సన్నివేశాలు చాలా ఉన్నాయి. హింసలో కూడా ఓ భావోద్వేగం ప్రేక్షకులకు కనపడుతుంది" అని వివరించారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల మాట్లాడుతూ, "సినిమా కాస్త ఆలస్యమైనా, విడుదలైన ప్రతి అప్‌డేట్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఇది ఒక విప్లవాత్మక, భావోద్వేగభరితమైన చిత్రం. తల్లీకొడుకుల కథతో పాటు, అణచివేతకు గురైన ఒక సమాజం కథ ఇది" అని అన్నారు. కాళోజీ మాటలను గుర్తుచేస్తూ, "'పుట్టుక మనది, చావు మనది, కానీ మన బతుకంతా దేశానిది' అనే వాక్యం ఈ కథకు స్ఫూర్తి. దేశం కోసం పోరాడిన ప్రజలకు, అదే దేశంలో చోటు లేనప్పుడు ఏం చేయాలో తెలియక తిరగబడటమే 'ది ప్యారడైజ్' కథ" అని తెలిపారు. అభిమానుల్లో భారీ అంచనాలను రేకెత్తిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 24న విడుదల కానుంది.

## వేగం పెంచిన 'ధర్మన్'




సూపర్ స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న భారీ చిత్రం 'ధర్మన్' షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా మూడో షెడ్యూల్ బుధవారం ప్రారంభమైంది. ఈ విషయాన్ని దర్శకుడు అశ్వత్ తన ఎక్స్ ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. షూటింగ్ సెట్స్ నుంచి ఒక ఆసక్తికరమైన బిహైండ్-ది-సీన్స్ (బీటీఎస్) వీడియో క్లిప్‌ను ఆయన పంచుకున్నారు. ఈ వీడియోలో సూపర్ స్టార్ రజనీకాంత్, నటి రాశి ఖన్నాతో ముచ్చటిస్తూ కనిపించారు. "ధర్మన్ మూడో షెడ్యూల్ కోసం మళ్లీ తలైవర్‌తో కలిశాను" అంటూ ఈ పోస్ట్‌కు క్యాప్షన్ జోడించారు. ఈ క్లిప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇటీవలే సెప్టెంబర్ 4న ఈ చిత్ర రెండో షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో చిత్ర నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్.. రజనీకాంత్ ఒక సీనియర్ మెడికల్ ఫ్యాకల్టీగా జూనియర్ డాక్టర్లకు పాఠాలు చెబుతున్న సన్నివేశాలతో కూడిన వీడియోను విడుదల చేసింది. ఈ లుక్‌కు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఈ చిత్రాన్ని లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తున్నారు. కమల్ నిర్మాణంలో రజనీ నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై తమిళంతో పాటు తెలుగు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. 'ధర్మమే వెల్లుమ్' (ధర్మమే గెలుస్తుంది) అనే ట్యాగ్‌లైన్‌తో కమల్ హాసన్ స్వయంగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు. ఈ చిత్రంలో రజనీకాంత్ ఒక వైద్యుడి పాత్రలో నటిస్తూనే, సమాజంలోని నేరస్థులను శిక్షించే శక్తివంతమైన పాత్రలో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. గతంలో విడుదలైన టైటిల్ పోస్టర్‌లో ఆపరేషన్ థియేటర్‌లో స్కాల్‌పెల్ చేతిలో పట్టుకుని, ఒక రౌడీ మృతదేహంపై కాలు వేసి ఉన్న రజనీకాంత్ లుక్ సినిమాపై ఉత్కంఠను మరింత పెంచింది. ఈ చిత్రానికి యువ సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, నికేత్ బొమ్మి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీతలైన అన్బరివ్ ద్వయం స్టంట్స్ కొరియోగ్రఫీ చేస్తున్నారు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609